సాక్షి
బాపట్ల
శుక్రవారం, 24, మే, 2024



లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల

నకరికల్లు:స్థానిక ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనర్సింహస్వామి తిరునాళ్ల మహోత్సవం గురువారం నిర్వహించారు. విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు.



ఈశ్వరుడికి విశేష పూజలు

తెనాలి రూరల్: తెనాలి సుల్తానాబాద్‌లోని శ్రీ గంగా కాశీ అన్నపూర్ణేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థాన వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా దేశమ్మ తిరునాళ్ల



గొరిగపూడి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం గొరిగపూడి గ్రామ దేవత దేశమ్మతల్లి తిరునాళ్ల గురువారం వైభవంగా జరిగింది. అమ్మవారికి పసుపుకుంకుమలు, చద్ది నైవేద్యాలు సమర్పించుకున్నారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుడిని దర్శించుకున్న సుప్రీం కోర్టు జడ్జి రవికుమార్



అమరావతి: అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరుడిని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.టి. రవికుమార్ గురువారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ ఈఓ వేమూరి గోపీనాథశర్మ, అర్చకులు రవికుమార్ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దేవాలయంలోకి ఆహ్వానించారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం సుప్రీంకోర్టు న్యాయమూర్తి రవికుమార్ దంపతులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక న్యాయమూర్తులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్, పది సప్లిమెంటరీ పరీక్షలు


నరసరావుపేటఈస్ట్: ఇంటర్మీడియట్, పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ ఒకటో తేదీ వరకు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 26 పరీక్ష కేంద్రాలలో 14,935 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్, వృత్తి విద్యా విద్యార్థులు 10,157మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,778మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్(08647223355) ఏర్పాటు చేసినట్లు ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎం.నీలావతిదేవి తెలిపారు. 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 23 పరీక్ష కేంద్రాల్లో 6,199మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఆయా కేంద్రాల్లో సీఈలు, డీవోలతోపాటు 300మంది ఇన్విజిలేటర్లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విధుల్లో పాల్గొంటున్నట్లు డీఈఓ తెలిపారు.

దివ్యాంగ చిన్నారులపై ప్రత్యేక దృష్టి



గురజాల: దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించి వారికి కావాల్సిన అవసరాలను తీర్చే విధంగా అధికారులు 40 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. 0 నుంచి 18 ఏళ్ల వయస్సు లోపల ఉన్న పిల్లలను గుర్తించి వారి అవసరాలు తీర్చడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఐఈఆర్పీలు తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. వారికి అనుగుణంగా చదువులో మంచి ప్రతిభ కనబరిచేలా చూడటం జరుగుతుందన్నారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. గ్రామాల్లో అంగన్ వాడీ కేంద్రాలు, సచివాలయాల్లో గల సిబ్బందికి ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలుపుతున్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు మాచర్ల విజయలక్ష్మి, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 504.80 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 806.70 అడుగుల వద్ద ఉంది.



జనసందోహం నడుమ ఊరేగింపుగా వెళ్తున్న భావదేవుడు

భక్తజన భావపురి

- వైభవంగా భావదేవుడి రథోత్సవం
- జనసంద్రంగా రథం బజార్
- ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బాపట్ల: భావపురి నడిబొడ్డున కొలువుతీరిన భావదేవుడి రథోత్సవం గురువారం సాయంత్రం కన్నుల పండువగా జరిగింది. శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీక్షీరభావన్నారాయణ స్వామికి గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఆలయ అర్చకుల సమక్షంలో అంగరంగవైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం స్వామిని గరుడ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. 1431వ నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం నుంచి రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భావదేవుడికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు బాపట్ల నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి తరలిరావడంతో రథం బజార్ సెంటర్ కిక్కిరిసిపోయింది. ఉత్సవం ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంత వరకు స్వామి రథాన్ని లాగేందుకు పోటీ పట్టారు. క్షీర భావన్నారాయణ స్వామి నామాన్ని స్మరిస్తూ దేవాలయం నుంచి రథం బజార్ సెంటర్ మీదుగా ఆంజనేయస్వామి దేవాలయం వరకు రథోత్సవాన్ని నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత భక్తులు స్థానిక భావన్నారాయణస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రథానికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

పాత పగలతోనే ప్రశాంత్ హత్య

- ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పట్టణ పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సీహెచ్. మురళీకృష్ణ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

బాపట్ల టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఈనెల 15న జరిగిన నాయుడుకుప్పం ప్రశాంత్ అలియాస్ మారి హత్య పాత కక్షల నేపథ్యంలోనే జరిగిందని డీఎస్పీ సీహెచ్. మురళీకృష్ణ తెలిపారు. నిందితుల్ని గురువారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు చెప్పారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హత్య కేసు వివరాల్ని వెల్లడించారు. హత్యకు గురైన ప్రశాంత్, అతని పిన్ని కొడుకు రామ్‌చరణ్ నెల్లూరు జిల్లా, మైపాడు రోడ్డు, వైకుంఠపురంలో నివాసం ఉంటారు. గతేడాది అక్టోబర్ 19న స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో తలెత్తిన వివాదంలో మహీధర్ అలియాస్ మహీధర్‌రెడ్డిని ప్రశాంత్, రామ్‌చరణ్‌లు హత్య చేశారు. ఈ కేసులో జైలుకెళ్లిన ఇద్దరూ జనవరిలో బెయిల్‌పై విడుదలయ్యారు. అప్పటి నుంచి మహీధర్ బాబాయి అదిపరెడ్డి కృష్ణ అలియాస్ కృష్టారెడ్డి , ప్రశాంత్‌లు ఒకరినొకరు చంపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దానిలో భాగంగా ఈనెల 14న ప్రశాంత్ బాపట్లలోని తండ్రి దగ్గరకు వచ్చిన విషయం ప్రశాంత్ స్నేహితుడైన కోమరిక ఈశ్వర్‌కు తెలిసింది. అతడు మహీధర్ స్నేహితులైన రేణుమడుగు లక్ష్మయ్య, బెల్లంకొండ అంకయ్య, పంగా రోహిత్‌లకు తెలియజేశాడు. దీంతో వెంటనే వీరంతా కలిసి ప్రశాంత్ బాపట్లలో ఉన్న విషయాన్ని మహీధర్ బాబాయి కృష్టారెడ్డికి చెప్పారు. అతడు స్నేహితుడైన ద్వారకచర్ల లక్ష్మణ్ అలియాస్ లక్ష్మణ్‌రెడ్డిలను కలుపుకొని అంతా కావలి టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నారు. రోహిత్‌కు తెలిసిన వాళ్ల దగ్గర కారు తీసుకొని బాపట్ల వచ్చారు. బాపట్ల చేరుకున్న తర్వాత ప్రశాంత్‌కు కోమరిక ఈశ్వర్‌తో ఫోన్ చేయించారు. బాపట్లలోని పాత బస్టాండ్ ఎస్‌బీఐ ఏటీఎం ముందు ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న వెంటనే అదే కారులో అక్కడికి చేరుకున్నారు. రోడ్డుపై నిలబడి ఉన్న ప్రశాంత్‌ను కారుతో ఢీకొట్టి వారి వెంట తెచ్చుకున్న కత్తులతో విచక్షణారహితంగా నరికి చంపారు. హత్య కేసులో ముద్దాయిల కోసం అప్పటి నుంచి పోలీసులు గాలిస్తున్నారు. పట్టణంలోని విలియం బూత్ కళాశాల సమీపంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో హత్య కేసులో నిందితులుగా గుర్తించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసులో కృష్టారెడ్డి, రేణుమడుగు లక్ష్మయ్య, ద్వారకచర్ల లక్ష్మణ్, పంగా రోహిత్, బెల్లంకొండ అంకయ్య, కోమరిక ఈశ్వర్‌లతోపాటు కారును స్వాధీనం చేసుకొని కోర్టుకు హాజరు పరిచామని చెప్పారు. హత్య కేసును ఛేదించిన బాపట్ల పట్టణ సీఐ యు. శ్రీనివాసులు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

'ఆమంచి'పై చర్యలు తీసుకోండి

చీరాల: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆమంచి కృష్ణమోహన్ ఎన్నికల రోజున నియోజకవర్గంలోని పలు పోలింగ్ బూత్‌లలో అనుచరులతో వెళ్లి దౌర్జన్యం చేశారని వేటపాలేనికి చెందిన జర్నలిస్ట్ నాయుడు నాగార్జునరెడ్డి కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. అధికారుల్ని బెదిరించడం ద్వారా ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగనీయకుండా ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారని, ఆమంచిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ముందురోజు ఆయన అనుచరులు చీరాల మండలం ఈపూరుపాలెం, వేటపాలెం మండలం దేశాయిపేటలో ఓట్లు కొనుగోలు చేస్తూ పట్టుబడ్డారన్నారు. దీనిపై ఈపూరుపాలెం, వేటపాలెం పోలీస్‌స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు అయిందని తెలిపారు. ఎన్నికల రోజున వేటపాలెం, చీరాల పట్టణంలోని పోలింగ్ బూత్‌ల వద్ద ఇతర పార్టీల అభ్యర్థుల అనుచరులపై మారణాయుధాలతో భౌతికదాడులకు దిగారని, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కూడా నమోదు అయిందని నాగార్జునరెడ్డి వివరించారు.

మాచర్లలో భద్రత కట్టుదిట్టం

- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు
- విస్తృతంగా తనిఖీలు
- పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు
- ఎస్పీ మలికా గార్గ్ నేతృత్వంలో బందోబస్తు



పట్టణంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

మాచర్ల : టీడీపీ చలో మాచర్లకు పిలుపునివ్వడంతో జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాలతో మాచర్లలో గురువారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు యంత్రాంగంతో పాటు ర్యాపిడ్ ఫోర్స్ బలగాలను రంగంలోకి దించారు. ఉదయం నుంచి నియోజకవర్గంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. చలో మాచర్లకు అనుమతి లేదని బయటి వ్యక్తులు ఎవ్వరూ రాకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో ఎస్పీ మలికా గార్గ్ నేతృత్వంలో పటిష్ట చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలోని గ్రామాలతోపాటు బయటి ప్రాంతాల నుంచి వ్యక్తులు మాచర్ల రాకుండా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ఉదయం నుంచే విస్తృతంగా తనిఖీ చేపట్టారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేసిన తర్వాతనే అనుమతించారు. గుంపులు గుంపులుగా తిరగకుండా చర్యలు తీసుకున్నారు. వ్యాపార, వాణిజ్య దుకాణాలను 10గంటల నుంచి సాయంత్రం వరకు మూసివేయాలని పోలీసులు వ్యాపారులను ఆదేశించారు. ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పల్నాడు జిల్లా పోలీసు అధికారులు మాచర్లలో మకాం వేసి ఎక్కడా ఒక చిన్న సంఘటన జరగకుండా పర్యవేక్షించారు. ముందు జాగ్రత్తగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులను హౌస్ అరెస్టు చేశారు. ఎలాంటి సంఘటనలు జరగకపోవడంతో పోలీసులు, ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

జేఎన్‌టీయూ పరిధిలో డ్రోన్ల ఎగురవేత నిషేధం

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించే జేఎన్టీయూ కాలేజ్ పరిధి కాకాని మండలంలో మానవ రహిత డ్రోన్లను ఎగురవేయుట నిషేధిత ప్రాంతంగా గుర్తించామని జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేశ్ బి.లత్కర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున ఆ ప్రాంతంలో మానవ రహిత డ్రోన్లు ఎగురవేయడం నిషేధమని, నిబంధన అతిక్రమించి ఎగరవేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

కలెక్టర్ పి.రంజిత్ బాషా



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: ఓట్ల లెక్కింపునకు సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌటింగ్ ఏర్పాట్లపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా రంజిత్‌బాషా మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో నిబంధనల మేరకు టేబుల్స్ ఏర్పాటు చేశామని వివరించారు. ఓట్ల లెక్కింపునకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామంటూ నివేదించారు. సమావేశంలో జేసీ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే కూటమి గందరగోళం

- ఎమ్మెల్యే కోన రఘుపతి



బాపట్ల: ఓటమి భయంతోనే మాచర్లలో టీడీపీ కూటమి గందరగోళం సృష్టించిందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. గురువారం స్థానికంగా ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాచర్లలో జరిగిన వివాదం పూర్తిస్థాయి సీసీ పుటేజీ ఇవ్వకుండా కొద్దిమేరకు మాత్రమే బయటపెట్టి నాటకాలకు తెరతీస్తున్నారని కోన దుయ్యబట్టారు. పూర్తిస్థాయి సీసీ పుటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీడీపీ ఒక శాతం ఓటు బ్యాంకు కూడా లేని బీజేపీతో పొత్తు పెట్టుకుని వ్యవస్థను మేనేజ్ చేయాలని చూసిందని కోన విమర్శించారు. కొన్నిచోట్ల కావాలని గొడవకు ప్రత్యక్షంగా కారణం కాగా మరికొన్ని పరోక్షంగా వివాదాలకు దిగారని ఆరోపించారు. బాపట్ల ప్రాంతంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని కోన చెప్పారు. బాపట్ల పట్టణంలో విలువైన తూర్పుసత్రాన్ని అన్యాక్రాంతం కాకుండా అడ్డుకుంటామని తెలిపారు. అక్కడ మినీ స్టేడియం , అపరకర్మశాల నిర్మాణం చేపడుతామని చెప్పారు. ఐటీసీ కంపెనీకి తూర్పు సత్రం కట్టబెట్టేందుకు చేసే ప్రయత్నాల్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

విధ్వంసానికి పక్కా ప్లాన్

- వ్యూహాత్మకంగా బ్రహ్మారెడ్డిని రంగంలోకి దించిన టీడీపీ
- అతనికి ఆర్థికంగా అండదండలు
- జూలకంటి రాకతోనే అల్లర్లు ప్రారంభం
- భయపడుతున్న నియోజకవర్గ ప్రజలు

మాచర్ల: మాచర్ల నియోజకవర్గంలో విధ్వంసానికి టీడీపీ పక్కా ప్రణాళికను రూపొందించింది. దీంతో భాగంగానే ఫ్యాక్షనిస్టు జూలకంటి బ్రహ్మానందరెడ్డిని నియోజకవర్గానికి తీసుకొచ్చారు. అతను నియోజకవర్గంలో అడుగుపెట్టినదిమొదలు గొడవలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలో 2004 నుంచి ఇప్పటి వరకు టీడీపీ విజయం సాధించలేదు. నిరాశలో ఉన్న టీడీపీకి ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. ప్రజాభిమానాన్ని పొందిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఈ ఎన్నికలలో ఎలాగైనా అడ్డగించాలని మాస్టర్ ప్లాన్ వేశారు. పిన్నెల్లి హవాను అడ్డగించాలంటే బ్రహ్మారెడ్డి తప్పా ఎవరి వల్ల కాదని భావించి టీడీపీ అధినేత చంద్రబాబు వ్యూహం పన్నారు. ఇందులో భాగంగా ఏడాదిన్నర కిందట బ్రహ్మారెడ్డిని పిలిచి 'నిన్ను ఇన్‌ఛార్జిగా నియమిస్తా, నీకు అన్ని రకాలుగా పార్టీ అండదండలతో పాటు ఆర్థిక సహకారం అందిస్తా'మని భరోసా ఇచ్చారు. అక్కడే కథ మొదలైంది. అప్పటి నుంచి మొదటగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన కారంపూడి మండలం నుంచి నియోజకవర్గంలోకి ప్రవేశించారు. ఆ రోజే పిన్నెల్లికి సంబంధించిన వ్యాపార సంస్థ ముందు ఈలలు వేసి రెచ్చగొట్టే విధంగా వ్యవహరించారు. అక్కడ నుంచి జూలకంటి ప్రతి గ్రామంలో పర్యటిస్తూ 'మీకెందుకు నేనున్నా గొడవలు పెట్టుకోండి మనకు పైనుంచి డబ్బులు వస్తాయ'ంటూ రెచ్చగొట్టారు. ప్రతి గ్రామంలో చిచ్చు రేపారు. ఏ చిన్న గొడవ జరిగినా అది అధిష్టానానికి తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడులో చంద్రయ్య హత్యను హైలెట్‌గా చిత్రీకరించారు. జంగమహేశ్వరపాడులో గొడవ సృష్టించి పారిపోయిన వ్యక్తికి మద్దతు పలికాడు. అక్కడ నుంచి వెల్దుర్తి, బోదిలవీడు, శిరిగిరిపాడు, లోయపల్లితోపాటు అనేక గ్రామాల్లో విధ్వంసాలకు తెరతీశాడు. కారంపూడి మండలం ఒప్పిచర్ల, ఓబులేశునిపల్లె, చింతపల్లి, పేటసన్నిగండ్లలో, రెంటచింతల మండలంలోని తుమృకోట, పాలవాయి గేటుతో పాటు అనేక కమ్మ సామాజిక వర్గానికి చెందిన గ్రామాలకు వెళ్లి ఈసారి మనదే గెలుపంటూ వారిని ఉసిగొలిపి గొడవలు చేయించారు. ప్రతి గొడవకు పీఆర్కే కారణమంటూ ప్రచారం చేయించారు. ప్రతి రోజూ ఎల్లో మీడియాలో ఆయన మీద బురదచల్లుతూ ప్రెస్‌మీట్లు పెట్టి నానా రచ్చ చేశారు. అనేక గ్రామాలలో రచ్చను పెంచిన ఆయన ఎంపీ అభ్యర్థి లావు కృష్ణదేవరాయలు మద్దతు వచ్చాక మరింత రెచ్చిపోయారు. ఎన్నికల ముందు రోజు నుంచి ఒక పథకం ప్రకారం గొడవలు సృష్టించారు. అందులో భాగంగానే పాలవాయి గేటులో బీభత్సం, తుమృకోటలో ఈవీఎంల ధ్వంసం, జెట్టిపాలెంలో ఘర్షణ, గుండ్లపాడులో ఒక వైపు వ్యవహరించేలా ఒక వర్గాన్ని ప్రోత్సహించారు. సొంతూరైన వెల్దుర్తిలో రిగ్గింగ్ చేసుకొని కండ్లకుంట, కొత్తపుల్లారెడ్డిగూడెంలో సంబంధం లేని ఇద్దరిని కూర్చోబెట్టి రగడకు ప్రయత్నించారు. ఇదంతా తమకు అనుకూలమైన పోలీసులతో కలిసి ముందుగానే సిద్ధం చేసుకొన్నారు. మాచర్ల మండలం కొత్తపల్లి, అలుగురాజుపల్లి, కంభంపాడు, రాయవరం గ్రామాలలో అలజడులు సృష్టించారు. అన్నిచోట్ల టీడీపీ ఆధిపత్యం కోసం ప్రయత్నించారు. హింసాత్మక ఘటనల నేపథ్యంలో పోలీసులు నియోజకవర్గ వ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. దీంతో వ్యాపారులతోపాటు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పటి ఎస్పీపై ఎన్నికల సంఘం వేటు వేసి కొత్త ఎస్పీని నియమించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

బీసీజీ టీబీ టీకాకు విశేష స్పందన

- 3,24,964 మందికి టీకాలు
- రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ తాళ్లూరి రమేష్



బీసీజీ టీబీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: 18 ఏళ్లు పైబడిన వారికి ఆరు కేటగిరీల్లో 12 జిల్లాల్లో కొనసాగుతున్న బీసీజీ టీబీ టీకాకు విశేష స్పందన లభించిందని రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ తాళ్లూరి రమేష్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,24,964 మందికి టీకాలు వేశామన్నారు. గురువారం ఆయన గుంటూరులోని పలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ) పరిధిలో గోరంట్ల, మల్లికార్జున పేట, నాజ్ సెంటర్, గుంటూరువారితోట, ఓల్డ్ గుంటూరు, ఐపీడీ కాలనీ, లాంచెస్టర్ రోడ్, శ్రీనివాసరావు తోట తదితర ప్రాంతాల్లో బీసీజీ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి గురువారం టీకాను వేస్తున్నామని తెలిపారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో ఆయా జిల్లాలకు నియమితులైన నోడల్ ఆఫీసర్లు టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. 12 జిల్లాల్లో బీసీజీ టీబీ టీకాను ఈనెల 16న ప్రారంభించామని, ఆ రోజు 1,71,507 మందికి వేశామని తెలిపారు.

క్లుప్తంగా

వైభవంగా లక్ష మల్లెల పూజ



రేపల్లె రూరల్: వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని రైలుపేటలో గల శ్రీ గంగా పార్వతీ సమేత స్వయంభువు రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన లక్ష మల్లెల పూజలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో శ్రీ లలితా సహస్ర నామపారాయణంతో పాటు భజనలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పంగులూరు యువకుడు హైదరాబాద్‌లో మృతి

జె.పంగులూరు: పంగులూరు గ్రామానికి చెందిన ఒక యువకుడు హైదరాబాదులో ఉద్యోగం చేస్తూ మెట్రో రైల్ దిగుతూ కాలు జారి కిందపడి బుధవారం మరణించాడు. గురువారం సాయంత్రం మృతదేహాన్ని పంగులూరు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పంగులూరు గ్రామానికి చెందిన షేక్ రమేష్ (22) హైదరాబాద్ యాక్సిస్ బ్యాంకులో పని చేస్తున్నాడు. ఉద్యోగరీత్యా మెట్రో రైల్లో ప్రయాణిస్తూ దిగుతుండగా కాలు జారి కింద పడి మరణించినట్లు చెబుతున్నారు. కాగా రమేష్‌కు పెళ్లి కాలేదు.

మాచర్లలో కొనసాగుతున్న 144 సెక్షన్

మాచర్ల: పోలింగ్ సందర్భంగా నియోజకవర్గంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో విధించిన 144 సెక్షన్ గురువారం కూడా కొనసాగింది. అందులో భాగంగా ప్రముఖ నాయకులందరినీ హౌస్ అరెస్టు చేశారు. వారంతా బయటకు రాకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. పోలీసు అధికారులు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఎటుచూసినా పోలీసు పహారాలో మాచర్ల నియోజకవర్గం ఉంది. ఐజీ, ఎస్పీ, డీఎస్పీ అధికారులతోపాటు పలువురు సీఐలు, ఎస్ఐలు వందలాది మందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

తిరుపతికి వెళ్లి వస్తూ అనంత లోకాలకు..

- నల్లగొండ జిల్లాలో రోడ్డు ప్రమాదం
- కారంచేడు మహిళ మృతి

కారంచేడు: తిరుపతిలో బిడ్డ పుట్టు వెంట్రుకలు తీయించుకొనేందుకు వెళ్లిన కుటుంబం దైవ దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. కారంచేడుకు చెందిన పొత్తూరి సత్యనారాయణ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు. చిన్న బడ్డీ కొట్టు ఆధారంగా కష్టపడి చదివించారు. పిల్లలు కూడా చక్కగా చదువుకొని మంచి ప్రయోజకులయ్యారు. ఒకరు బెంగళూరులో, మరొకరు హైదరాబాద్‌లోను స్థిరపడి మంచి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న పొత్తూరి వెంకట శివసుబ్రహ్మణ్యం భార్య రేఖ ప్రియాంక (32), వారి సంతానం అయిన ఐదు సంవత్సరాల నిక్షిత్, మూడు సంవత్సరాల తేజవర్ధన్‌తో కలిసి కారులో తిరుపతి వెళ్లారు. చిన్న కుమారుడి పుట్టు వెంట్రుకలు తీయించుకొని, దైవ దర్శనం అనంతరం వారు మరలా హైదరాబాద్‌కు బుధవారం రాత్రి బయలుదేరారు.



ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జు అయిన కారు ,

గురువారం వేకువజామున నల్గొండ జిల్లా తిప్పర్తి వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రేఖ ప్రియాంక అక్కడికక్కడే మృతి చెందగా, భర్త సుబ్రహ్మణ్యానికి తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలియడంతో కారంచేడులోని చినవంతెన సెంటర్‌లో వారు నివాసముండే ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. బంధువులు వెంటనే సంఘటన జరిగిన ప్రదేశానికి వెళ్లి సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు.



రేఖ ప్రియాంక మృతదేహం

రెండు కార్లు ఢీ : మహిళ మృతి

వేటపాలెం: ఎదురెదురుగా వేగంగా వచ్చిన రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో మహిళ మృతి చెందింది. ఈ ఘటన బాపట్ల జిల్లా వేటపాలెం మండలం పందిళ్లపల్లి దగ్గరలో జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో జంగిలి కేఫ్ టీ స్టాల్ దగ్గరలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తెనాలి నుంచి కారులో వేటపాలెం సముద్రతీరానికి ఐదుగురు యువకులు వచ్చారు. బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న జంగిల్ కేఫ్ టీస్టాల్ వద్ద కారు ఆపి టీ తాగారు. అనంతరం తిరిగి తెనాలి వైపు బయలు దేరారు. అదే సమయంలో కనిగిరికి చెందిన మన్నెపల్లి శిరీష (30) మరో వ్యక్తితో కలసి బాపట్ల వెళ్లి తిరిగి కనిగిరికి వెళుతున్నారు. జంగిల్ కేఫ్ టీస్టాల్ దగ్గరకి వచ్చే సరికి రెండు కార్లు వేగంగా ఒకదానికొకటి ఢీకొట్టుకున్నాయి. దీంతో ముందు భాగాలు భారీగా దెబ్బతిన్నాయి. కనిగిరి వెళుతున్న కారులో ఉన్న శిరీష తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వీరితో పాటు ఎదురుగా వచ్చిన కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు యువకులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వేటపాలెం ఎస్ఐ ఘటన స్థలానికి చేరుకున్నారు. రెండు కార్ల డోర్లు పగలగొట్టి అందులో ఇరుక్కుపోయిన వారిని 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని, శిరీష మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.



గాయపడిన వారిని 108లో చీరాల వైద్యశాలకు తరలిస్తున్న సిబ్బంది



బైపాస్‌లో ఢీకొన్న కార్లు

బాలుడికి కృత్రిమ చేతులు అమరిక

తాడేపల్లిరూరల్: మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళకరం-2024 జెమ్ ఎంౖ1 హ్యాండ్స్ కృత్రిమ చేతుల ఉచిత పంపిణీ శిబిరాన్ని గురువారం వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు అందె రేవంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నారాయణపేటకు చెందిన దివ్యాంగుడు ఎస్.నరేందర్ ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తయిన తరువాత 2022 జూలై 10న తల్లి అంజమ్మతో కలసి పొలం పనులకు వెళ్లాడన్నారు. గుడిసె పైకప్పు సరిచేద్దామని పైకి ఎక్కగా తక్కువ ఎత్తులో వున్న 11 కేవీ హైటెన్షన్ విద్యుత్‌వైర్‌ను తాకాడని, దీంతో విద్యుదాఘాతానికి గురై రెండు చేతులను కోల్పోయాడని చెప్పారు. మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కృత్రిమ చేతులు అమరుస్తున్న విషయాన్ని తెలుసుకుని ఇక్కడకు వచ్చారని, జపాన్‌కు చెందిన క్రిస్‌గల్ బృందం నరేందర్‌కు అమర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి రోటరీ క్లబ్ ప్రోగ్రామ్ చైర్మన్ ఇసునూరు అనిల్ చక్రవర్తి, సెక్రటరీ గాజుల శ్రీనివాసరావు, ఫైనాన్షియల్ చైర్మన్ పారేపల్లి నిరంజన్ గుప్త, ప్రాజెక్ట్ చైర్మన్ అందే మురళీమోహనరావు పాల్గొన్నారు.



500 మందిపై బైండోవర్ కేసుల నమోదు

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 500 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంబాబు గురువారం పేర్కొన్నారు. వీరిలో కొంత మంది ఎన్నికలకు సంబంధం ఉన్న కేసుల్లో కూడా ఉన్నారన్నారు. వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ముప్పాళ్లలో 11 మందికి బాండ్స్ అమౌంట్ చెల్లించమని తహసీల్దార్ నోటీసులు జారీ చేశారన్నారు. రాజుపాలెంలో ఐదుగురికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారిపై రౌడీషీట్స్ ఓపెన్ చేయనున్నట్లు వెల్లడించారు. మరికొందరిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసేందుకు పోలీసు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు తెలియజేశారు. ఎవరైనా గొడవలను ప్రోత్సహించినా, గొడవలు చేసినా వారిపై కఠినమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

42 మంది అరెస్టు

పిడుగురాళ్ల: ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గొడవలకు దిగిన రాజకీయపార్టీలకు చెందిన ముఖ్యులను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపారు. మండలంలోని పెద అగ్రహారం గ్రామానికి చెందిన ఇరుపార్టీలకు చెందిన 30 మంది, కరాలపాడు గ్రామానికి చెందిన 12 మంది మొత్తం 42 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరిని రాజమండ్రి సెంట్రల్ జైలు, నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా ఓట్ల లెక్కింపు రోజున గొడవలకు, అల్లర్లకు పాల్పడితే అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకొని వారిని కూడా రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించనున్నట్లు తెలిపారు. రాజకీయ గొడవలకు పాల్పడితే వారి జీవితం జైలు పాలు కావాల్సి వస్తుందని, ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని హెచ్చరించారు.

వైభవంగా శ్రీరంగనాథస్వామి కల్యాణ మహోత్సవం



శ్రీరంగనాథస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

విజయపురి సౌత్: మాచర్ల మండలం అనుపులో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం గురువారం అంగ రంగ వైభవంగా జరిగింది. ఈ కల్యాణానికి ముందుగా శ్రీదేవి, భూదేవి, శ్రీరంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులను ఆలయ అర్చకులు కురుమేటి దత్తాత్రేయశర్మ, కురుమేటి దత్తకుమార్‌శర్మ, శ్రీపాద సుబ్రహ్మణ్యశర్మ, రాజశేఖర్ శర్మ తదితరులు వేదమంత్రాలతో కల్యాణ వేదిక పైకి తోడ్కొని వచ్చారు. అనంతరం శ్రీదేవి, భూదేవి ఎదురుగా శ్రీరంగనాథస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కల్యాణం తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆయా గ్రామాల నుంచి భక్తులు ప్రభలను అలంకరించి మేళతాళాలతో అనుపు రంగనాథస్వామి దేవాలయానికి తీసుకువచ్చారు. ఆలయంలో ఉదయం స్వామి వారి అలంకరణ, గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, నవగ్రహారాధన, ఎదురుకోలా, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగార్జునకొండ కన్జర్వేటివ్ అసిస్టెంట్ యు. వెంకటయ్య, రిటైర్డ్ ఇన్‌కంటాక్స్ కమిషనర్ స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియపై సమావేశం

తాడేపల్లి రూరల్: జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో గుంటూరు జిల్లా జేసీ, మంగళగిరి నియోజకవర్గ ఆర్ఓ రాజకుమారి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజంట్లకు కౌంటింగ్ ప్రక్రియపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సివిల్ అండ్ మెకానికల్ బ్లాక్, రూమ్ నం. 206, మొదటి అంతస్తులో కౌంటింగ్ జరుగుతుందన్నారు. ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉదయం 6.30 గంటలకు కౌంటింగ్ హాల్‌కు చేరుకోవాలని వివరించారు. మొబైల్ ఫోన్లు లోపలకు అనుమతించరని, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల సిబ్బందికి సహకరించాలని ఆమె కోరారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్లను కౌంటింగ్‌కు ఒక రోజు ముందు జూన్ 3వ తేదీ సాయంత్రం అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్ల సమక్షంలో ఏఎన్‌యూలో భద్రపరచడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ హాల్‌లో ఈవీఎం ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 3 టేబుల్స్, ఈటీపీబీఎస్ లెక్కింపునకు ఒక టేబుల్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. టేబుళ్ల వారీగా కౌంటింగ్ ఏజంట్లను నియమించుకోవాలని ఆమె సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

పాత గుంటూరులో భారీ అగ్ని ప్రమాదం

పట్నంబజారు: గుంటూరు నగరంలోని పాతగుంటూరు, సుద్దపల్లిడొంక శివారు ప్రాంతమైన ప్రగతీనగర్ సమీపంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీకి సంబంధించి ప్లాస్టిక్ పైపులు నిల్వ ఉంచిన ఓ కంపెనీలో గురువారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. సుమారు రూ. 2 కోట్ల విలువ చేసే ప్లాస్టిక్ పైపులు దగ్ధమైనట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. అయితే ప్రమాదకారణం తెలియరాలేదు. అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో భారీ ఎత్తున మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా నల్లటి పొగ కమ్మేసింది. స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సుమారుగా 40 లాట్లు వరకు పైపులు తగలబడినట్లు అధికారులు తెలిపారు. షాపుంజీ పల్లోంజీ కంపెనీకి సంబంధించిన కాంట్రాక్టు పనులకు చెందిన పైపులు దగ్ధమైనట్లు పోలీసులు తెలిపారు.



పులిచింతల నిర్వాసిత కేంద్రంలో తనిఖీలు

రాజుపాలెం: రాజుపాలెంలోని పులిచింతల నిర్వాసిత కేంద్రంలో పోలీసు అధికారులు గురువారం రాత్రి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నిర్వాసిత కేంద్రంలోని ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. గేదెల కొస్టాలలో, గడ్డివాముల్లోను, దొడ్లలోను సోదాలు నిర్వహించారు. ఎలాంటి మారణాయుధాలు, మందుగుండు సామగ్రి దొరకలేదు. ఎస్ఐ షమీర్‌బాషా కాలనీ వాసులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓట్ల లెక్కింపు రోజు శాంతియుతంగా ఉండాలని, ఊరేగింపులు, టపాసులు పేలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఏఎస్ఐ కిరణ్, సిబ్బంది ఉన్నారు.



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎస్ఐ బాషా

భార్యను కొట్టి చంపిన భర్త

గుంటూరు రూరల్: విలాసాలకు, మత్తు పదార్థాలకు అలవాటుపడిన ఓ వ్యక్తి తనకు డబ్బులు ఇవ్వలేదనే కోపంతో భార్యను కొట్టి హత్య చేసిన ఘటన నగరంలోని స్వర్ణభారతీ నగర్‌లోని ఐద్వానగర్‌లో జరిగింది. నిందితుడిని నల్లపాడు పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐద్వానగర్‌కు చెందిన జాతావత్ అశోక్‌నాయక్‌కు, స్థానికంగా ఉండే ఆశాబాయి(25)తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో అశోక్‌నాయక్ పలుమార్లు ఆశాబాయిపై దాడిచేసి డబ్బులు కావాలని హింసించేవాడు. తాగుడు, వ్యసనాలకు బానిసై భార్యను చిత్రహింసలకు గురిచేసేవాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఆశాబాయిని డబ్బులు కావాలని అడగ్గా ఆమె నిరాకరించింది. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఆవేశంతో అశోక్ ఆశాబాయిని తీవ్రంగా కొట్టాడు. తీవ్రగాయాలతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. స్థానికులు, బంధువులు ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందిందని తెలిపారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. విచారించి కోర్టుకు అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు.



నవరసభరితంగా సంగీత నాట్య పోటీలు



కేరళ రాష్ట్రం పెరావూర్‌కు చెందిన నియాసందీప్ చిరుతముత్తి ప్రదర్శన



అనంతపురానికి చెందిన జి నాగచిన్మయి తుమ్మెదలున్నాయేమిరా ప్రదర్శన



ప్రొద్దుటూరుకు చెందిన ఆర్ దివ్య నందిని పారేగోదావరి ప్రదర్శన



అర్మూరుకు చెందిన డి తన్వి కొండల్లో కోనల్లో ప్రదర్శన



ఆర్మూర్‌కు చెందిన జి మృదుల మొక్కజొన్నతోటలో ప్రదర్శన

- ఉర్రూతలూగించిన జానపద నృత్యాలు
- మూడో రోజు కొనసాగిన కళానిలయం జాతీయ స్థాయి సంగీత నాట్యపోటీలు

చిలకలూరిపేట: పురివిప్పిన నెమలిని తలపించే నృత్యాలు..మనసును పులకింపచేసే కీర్తనలు..సుమధుర గీతాలు...ఉర్రూతలూగించే జానపద నృత్యాల నడుమ కళానిలయం 39వ జాతీయస్థాయి నవరస శాస్త్రీయ, జానపద, సంగీత నాట్య కళారూపాల పోటీలు గురువారం మూడో రోజు కొనసాగాయి. పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కొనసాగుతున్న ఈ పోటీలలో చివరిరోజు వివిధ అంశాలలో కళాకారులు ఉత్సాహంగా పాల్గొని కళారూపాలను ప్రదర్శించారు. మూడో రోజు పోటీలను కళానిలయం నిర్వాహకుడు ప్రగడ రాజమోహనరావు సతీమణి శివసత్యనారాయణమ్మ నటరాజపూజ చేసి ప్రారంభించారు. సూర్య, చంద్ర విభాగాలలో నిర్వహించిన ఈ పోటీలలో జానపద నృత్యాలతోపాటు శాస్త్రీయ బృంద నాట్యాలు, శాస్త్రీయ జంట నాట్యాలు, శాస్త్రీయం కాని జంట నాట్యాలు, శాస్త్రీయం కాని బృంద నాట్యాలు, శాస్త్రీయ నృత్య నాటికలు ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తుమ్మెదలున్నాయేమిరా, చిరుతముత్తి, పారేగోదావరి, నా పేరు మల్లిగాడు, పోమతి పొన్నమ్మ, ఓరి మగడా వంటి జానపద నృత్యాలతో పాటు, శ్రీకృష్ణ తరంగిణి, సారూప్యం, దేవీస్తుతి, కాళింగ నర్తనం, శ్రీకృష్ణలీలలు, గోవర్ధనం వంటి బృందనాట్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా జానపద నృత్యాలు రసజ్ఞులైన ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. నాట్యాచార్యులకు సన్మానాలు నిర్వహించారు. ప్రేక్షకులు ఆసక్తిగా ప్రదర్శనలను వీక్షించారు.